



Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 362 | గురువారం 22 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- అప్పటి వరకు చర్చలేవ్ : పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు స్పష్టం**



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

“పార్లమెంట్‌లో నిష్పక్షపాతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అది జరగాలంటే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేసే వరకు చర్చకు ఆస్కారం లేదు” అని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో మూడో రోజు బుధవారం కూడా గత సీన్ రిపీటైంది. లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళం నెలకొంది. దీంతో రెండు సభలు వాయిదాల పర్వం తొక్కాయి. లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు సిద్ధపడ్డారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు తాము ఇచ్చిన - మిగతా 2లో..




# విరుచుకుపడ్డ యువత

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- పార్లమెంట్ వైపు మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు
- టియర్ గ్యాస్, లాఠీచార్జ్
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో చర్చలు నిష్ఫలం

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం, విద్యావ్యవస్థలో సంస్కరణలు మరియు విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (జజీపా) మరియు వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉద్యమానికి సంబంధించిన సమగ్ర వివరాలు:

**ఉద్యమ నేపథ్యం:** ఉపాధి లేని యువతను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన వ్యాఖ్యలకు నిరసనగా - మిగతా 2లో..



## దశాబ్దకాలంలో 152 పేపర్ల లీక్..

- విద్యార్థుల భవిష్యత్తు బూడిదలో పోసిన పన్నీరే!
- దేశంలో విద్యావ్యవస్థ పూర్తిగా అక్రమమయంగా మారింది
- 7.5 కోట్ల మంది విద్యార్థులు, కుటుంబాలపై తీవ్ర ఒత్తిడి
- విద్యార్థుల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పూర్తి మద్దతు
- కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

దేశంలో ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిన విద్యావ్యవస్థ నేడు తీవ్ర అక్రమమయంగా మారిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత దశాబ్దకాలంలో దేశవ్యాప్తంగా ఏకంగా 152 ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, సగటున లెక్కవేస్తే నెలకు ఒక పేపర్ లీకైనట్లేనని ఆందోళన - మిగతా 2లో..

## విద్యార్థులపై కక్షసాధింపు చర్యలు ఆపాలి

- సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్
- కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలతో లేఖ రాసిన సామాజిక వేత్త
- కేసులు ఎత్తివేస్తేనే అమరణ నిరాహార దీక్ష విరమణ
- పోలీసు అణచివేతపై ఆగ్రహం
- మేదాంత ఆసుపత్రికి తరలింపు



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

విద్యార్థుల భవిష్యత్తు కోసం, విద్యావ్యవస్థలో జవాబుదారీతనం కోసం పోరాడుతున్న యువతపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న కక్షసాధింపు చర్యలు వెంటనే ఆపాలని ప్రముఖ సామాజిక, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. 'ఛలో సంసద్' నిరసనలో పాల్గొన్న విద్యార్థులు, యువకులపై ఎలాంటి అక్రమ కేసులు, 2లో

# ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ..

- భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పల నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు.



మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. - మిగతా 2లో..



## నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

- సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే డిమాండ్
- నీట్ అవకతవకలపై ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు
- విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చాలని టీవీకే డిమాండ్
- రాహుల్ గాంధీ సహా విపక్ష నాయకుల అరెస్టును ఖండించిన టీవీకే

చెన్నై- సూర్య వాస్తవం

నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ డిమాండ్ చేసింది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, టీవీకే ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ప్రాధాన్యత - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు: సుప్రీంకోర్టు


న్యూఢిల్లీ- సూర్య వాస్తవం



పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. “మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు, అంత సమయం కూడా లేదు” అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలపై జోక్యం చేసుకోవాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. బుధవారం నాటి విచారణలో ఓ లాయర్ ఈ అంశాన్ని - మిగతా 2లో..

- మున్సిపల్ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ప్రత్యేక అధికారి నియామకం.. వేగంగా అనుమతులు ఇవ్వాలని ఆదేశం
- జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో వేగవంతంగా అభివృద్ధి పనులు
- అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటుకు ముహూర్తం.
- సైబరాబాద్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం, జంక్షన్ అభివృద్ధి బాధ్యతలు హెచ్ఎండీఏకు

## భూసేకరణ పూర్తి కాకుండా టెండర్లు పిలిస్తే చర్యలు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లోని బోధి పెవిలియన్ వేదికగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ, - మిగతా 2లో..

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. ప్రశ్నోత్తరాలకు ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. అయినా ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు మళ్లీ ఆందోళనను కొనసాగించాయి.

**టీఎంసీ ఎంపీ సస్పెన్షన్**

తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. అయితే ఈ ఆందోళన మధ్యే మహిళా ఎంపీలపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్టు టీఎంసీ రెబల్ మహిళా ఎంపీలు మితాలి బాగ్, శతాబ్ది రాయ్, కాకోలి ఘోష్ దస్తీదార్ ఆరోపించారు. ఈ విషయమై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కల్యాణ్ బెనర్జీని సస్పెండ్ చేస్తూ సభలో పెట్టిన తీర్మానాన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు. దీంతో ఆయన సభ నుంచి వెళ్లిపోయారు.

**రాజ్యసభలోనూ అదే తీరు**

రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు విద్యార్థులపై అణచివేత, లాఠీచార్జీ అంశంపై చర్చించాలని పట్టుబట్టాయి. దీనికి చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ అంగీకరించలేదు. గందరగోళం నేపథ్యంలో ఆయన సభను ఎనిమిది నిమిషాల్లోనే మధ్యాహ్నం 12.00 గంటలకు వరకు వాయిదావేశారు. అనంతరం ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను ఒక్క నిమిషంలోనే డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ పార్లమెంట్‌లో నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూల్ 267 కింద జారీ చేసే నోటీసుల గురించి డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ మాట్లాడుతూ ఈ నిబంధనను 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన' సందర్భాలలో మాత్రమే ఉపయోగించాలని అన్నారు. దేశంలో ఇప్పుడు జరుగుతున్నది ఓ 'అరుదైన సందర్భం' అని డీఎంకే ఎంపీ తిరుచి శివ స్పష్టం చేశారు.

# దశాబ్దకాలంలో 152 పేపర్ల లీక్..

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. బుధవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు.

**7.5 కోట్ల కుటుంబాల జీవితాలతో ఆటలు!**

పేపర్ లీకేజీల కారణంగా దేశంలో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు కోలుకోలేని విధంగా తీవ్ర ఒత్తిడికి, ఆందోళనకు గురయ్యారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో అత్యధికులు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారేనని చెప్పారు. తమ కష్టార్జితాన్నంతా పిల్లల చదువులు, పరీక్షల కోసం వెచ్చిస్తే.. చివరికి లీకేజీల వల్ల ఆ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతోందని అన్నారు. ప్రతి నెలా లక్షలాది మంది విద్యార్థులను మళ్లీ మళ్లీ అదే ఒత్తిడిలోకి నెట్టేస్తూ, ఆ తర్వాత ప్రభుత్వం తమకేమీ సంబంధం లేనట్లు దాటవేస్తోందని మండిపడ్డారు. "విద్య కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.1.4 లక్షల కోట్లు కేటాయిస్తుంటే..ఒక్క నీట్ పరీక్ష కోసమే దేశంలో విద్యార్థులు ఏడాదికి రూ.1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు."

**నిందితులపై కఠిన చర్యలేవి?**

శాంతియుతంగా నిరసన తెలుపుతూ న్యాయమైన విద్యావిధానం కావాలని కోరుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యలను, ఆయుధాలు గురిపెట్టే పరిస్థితిని రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. సీజేపీ ర్యాలీపై పోలీసుల మోహరింపును తప్పుపట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల తీవ్ర మనోవేదనకు గురై ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా నిందితులకు మాత్రం శిక్షలు పడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ విద్యార్థులుగా న్యాయమైన విద్యావిధానాన్ని అడగడం నేరమా అని ప్రశ్నించారు. బాధితుల తరపున నిలబడి, విద్యార్థుల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రధానితో సీఎం చంద్రబాబు భేటీ..

(మొదటిపేజీ తరువాయి)

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు.

విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సంతరించుకుంది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను కేవలం వ్యతిరేకించడమే కాకుండా, ఆ ప్రవేశ పరీక్షను సమూలంగా రద్దు చేయాలని టీవీకే స్పష్టం చేసింది. వైద్య విద్యకు సంబంధించిన అంశాలపై రాష్ట్రాలకు పూర్తి అధికారాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. అధికార పక్షమైన డీఎంకే పేరును నేరుగా ప్రస్తావించకుండా, ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుంటూ విమర్శలు గుప్పించింది. "నీట్‌ను రద్దు చేస్తాం" అంటూ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయబోమని టీవీకే పేర్కొంది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, అధికారంలోకి వస్తే నీట్‌ను రద్దు చేస్తామని డీఎంకే ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ టీవీకే ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని టీవీకే కేంద్రాన్ని డిమాండ్ చేసింది. నీట్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీకి విజయ్ నేతృత్వంలోని పార్టీ తన మద్దతును ప్రకటించింది. అదేవిధంగా, రాహుల్ గాంధీతో పాటు పలువురు విపక్ష నేతల అరెస్టును టీవీకే తీవ్రంగా ఖండించింది.

# నీట్ లీకేజీపై విరుచుకుపడ్డ యువత

(మొదటిపేజీ తరువాయి)

అభిజీత్ దీప్కే నేతృత్వంలో సోషల్ మీడియా వేదికగా 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో వ్యంగ్యాత్మక ప్రచారం ప్రారంభమైంది. అనతికాలంలోనే ఇది దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల, యువత భాగస్వామ్యంతో అతిపెద్ద విద్యా హక్కుల పోరాటంగా రూపాంతరం చెందింది.

**పార్లమెంట్ మార్చ్ – పోలీసులతో ఘర్షణ:** జంతర్ మంతర్ వద్ద వేలాదిగా సమకూరిన నిరసనకారులు పార్లమెంట్ వైపు 'చలో సంసద్' ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. బారికేడ్లను దాటుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కన్నీటి వాయు గోళాలు ప్రయోగించడంతో పాటు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, పోలీసు సిబ్బంది గాయపడగా, ఆందోళనకారులకు అత్యవసర చికిత్స అందించారు.

**కేంద్రంతో చర్చలు నిష్ఫలం:** నిరసనలు మిన్నంటిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి సీజేపీ (జప్రీ) ప్రతినిధి బృందంతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమక్షంలో చర్చలు జరిపింది.

అయితే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పేపర్ లీకేజీ బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం, విద్యార్థులపై నమోదైన కేసుల ఎత్తివేత వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.

**వాంగ్‌చుక్ ఆసుపత్రికి తరలింపు – అభిజీత్ దీప్కే దీక్ష:** జంతర్ మంతర్ వద్ద 20 రోజులకు పైగా అమరణ నిరాహార దీక్ష చేసిన ప్రముఖ సామాజిక వేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో, పోలీసు యంత్రాంగం ఆయనను బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించింది. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులతో ఆయనను గుర్గావ్‌లోని మేదాంత ఆసుపత్రి ఐసీయూకి మార్చారు. వాంగ్‌చుక్‌ను తరలించడాన్ని నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్వయంగా అమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు.

**ప్రతిపక్షాల మద్దతు – ఉద్యమ తీవ్రత:** ఈ ఆందోళనలకు ప్రతిపక్షాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. ప్రతిపక్ష నేతలు నిరసన ప్రదేశాన్ని సందర్శించి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. డిమాండ్లు నెరవేరే వరకు జంతర్ మంతర్ ఖాళీ చేసేది లేదని కాక్రోచ్ జనతా పార్టీ మరియు విద్యార్థి సంఘాలు స్పష్టం చేయడంతో ఢిల్లీలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు: సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రస్తావిస్తూ, కోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు స్పష్టంగా నిరాకరించింది. "మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా పాడుచేసుకోకండి" అని లాయర్‌కు సీజేఐ హితవు పలికారు. నీట్-యుజి పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రధానంగా నిరసనలు నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువత జర్నలిజం, సామాజిక ఉద్యమాల వైపు రావడంపై గతంలో సీజేఐ సూర్య కాంత్ స్పందిస్తూ 'కాక్రోచ్' (బొద్దింకలు) అనే పదాన్ని వాడగా, ఆ వ్యాఖ్యల ఆధారంగానే ఈ వ్యంగ్య వేదిక ఏర్పడటం గమనార్హం. ఆ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో, తాను నకిలీ డిగ్రీలు ఉన్న వారిని ఉద్దేశించి మాత్రమే ఆ మాట అన్నానని సీజేఐ తదనంతరం వివరణ ఇచ్చారు.

# విద్యార్థులపై కక్షసాధింపు చర్యలు ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

వేధింపులు ఉండబోవని కేంద్రం నుంచి స్పష్టమైన, అధికారిక హామీ వస్తేనే తాను అమరణ నిరాహార దీక్షను విరమిస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు ఆయన బుధవారం లేఖ రాశారు.

**హక్కుల పోరాటంపై పోలీసు బలగాలు:**

నీట్ (చీజుజు) ప్రశ్నాపత్రాల లీకేజీ, విద్యాశాఖ వైఫల్యాలపై జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులపై పోలీసు యంత్రాంగం దౌర్జన్యాలకు పాల్పడటంపై వాంగ్‌చుక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అణచివేత చర్యలు, పోలీసు బలగాల ప్రయోగాన్ని పక్కనపెట్టి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, పార్లమెంట్‌లో దీనిపై విస్తృత చర్చ జరపాలన్న డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించినప్పటికీ, పోరాటంలో పాల్గొన్న యువతపై ప్రతికార చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**హైకోర్టు ఆదేశాలతో మేదాంతకు తరలింపు:**

మరోవైపు, నిరాహార దీక్ష వల్ల ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు గుర్గావ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించి ఐసీయూలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 65 మందికి పైగా ఎంపీలు, ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆయనకు సంఘీభావం తెలిపారు. విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి యువత సాగిస్తున్న ఈ పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, ప్రభుత్వం స్పందించే వరకు ఒత్తిడి కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఆఫీసు అధికారుల సమావేశంలో పాల్గొన్న ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపాలిటీలో అనంతపురం జిల్లా ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ సూయాష్ కుమార్, విధి నిర్వహణలో భాగంగా మున్సిపల్ ఆఫీసు వ్యవస్థ సేవలు, నిర్వహణ సచివాలయం వ్యవస్థ సేవలు, నిర్వ హణ పై గుత్తి మున్సిపల్ ఆఫీసులో అధికారుల సమక్షంలో సమావేశంలో పాల్గొన్నారని గుత్తి మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మి యా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్బంగా శానిటేషన్,వా టర్ సప్లై, ట్యాక్స్ కలెక్షన్, వీధి దీపాలు, డ్రైనేజి సిస్టమ్, వాటర్ టెస్టింగ్, మున్సిపల్ ఆఫీసు నిర్వహణ వ్య యం రాబడి, ట్యాక్స్ డిజి టల్ పేమెంట్స్,ఈ ఆఫీస్ నిర్వహణ వంటి విషయాలపై పరిశీలన గావించారు.అనంతరం లచ్చునిపల్లి రోడ్డు ప్రాంతములో గల ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్ పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్.ఓ దాస రధి, ఏఈలు గోవిందప్ప, హరికిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఏ.ఈ రవికుమార్, మెప్మా టి.యమ్.సి చంద్రశేఖర్, ఆర్‌ఐలు ఫాయాజ్ అహ్మద్, నాగార్జున, అకౌంటెంట్లు పల్లవి, ఫరీన్, సచివాల య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో భూముల కౌలు వేలం పాట

**- రూ.49 వేల 500 ఆదాయం**



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం మండలంలోని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠానికి చెందిన 8.49 ఎకరాల వ్యవసాయ భూములను గురువారం బహిరంగ కౌలు వేలం ద్వారా కౌలుకు ఇచ్చారు. ఈ వేలంపాట ద్వారా మఠానికి రూ.49,500 ఆదాయం సమకూరింది. గతంలో ఇదే భూముల ద్వారా రూ.37,500 ఆదాయం లభించగా, ఈసారి రూ.12,000 అదనపు ఆదాయం వచ్చినట్లు ఈశ్వరి దేవి మఠం కార్యనిర్వహణాధికారి (ఈవో) బి.వి. జగన్మోహన్ రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ రాజంపేట తనిఖీ అధికారి జనార్ధన్ ప్రత్యేక పర్యవేక్షణలో ఈ బహిరంగ వేలంపాట పారదర్శకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలుదారులు, మఠ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం నిధుల విడుదల

**- లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఖాముఖి**



**శింగనమల – సూర్య వాస్తవం :** తల్లికి వందనం పథకం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా శింగనమల మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిపై చర్చించారు. శింగనమల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి "తల్లికి వందనం" పథకం ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల నిధులు అందని వారు వెంటనే మా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించడం జరిగింది.అలాంటి ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించి అర్హులందరికీ పథకం ప్రయోజనం అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# భూసేకరణ పూర్తి కాకుండా టెండర్లు పిలిస్తే చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మూడు కమిషనరేట్‌ల పరిధిలో సాగు తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సీఎం విస్తృతంగా చర్చించి, పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సందర్భంగా ఎలాంటి ప్రాజెక్టులకైనా ముందస్తుగా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకుండా టెండర్లు పిలవకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. అలాగే జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో ప్రాజెక్టుల అనుమతులు త్వరితగతిన లభించేలా సంబంధిత అన్ని శాఖల అధికారులతో ఉమ్మడి సమన్వయ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సైబరాబాద్ పరిధిలో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహం, దానికి సంబంధించిన జంక్షన్ అభివృద్ధి పనులను హెచ్‌ఎండీఏ వేగవంతం చేయాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వీటితో పాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ నూతన భవన నమూనాతో పాటు మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నమూనాలను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి, వాటి నిర్మాణం మరియు మౌలిక వసతుల కల్పనపై పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు.

# సంపాదకీయం

## విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!




కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు.డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం.భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది.ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది.మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు.డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

# తమ్మినేనికి బిగుస్తున్న ఉచ్చు

**శ్రీకాకుళం– సూర్య వాస్తవం :**
శాసనసభాపతిగా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి, చట్టాలను కాపాడాల్సిన స్థానంలో కూర్చుని నీతులు చెప్పిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం అక్రమాల జాతకం ఇప్పుడు ఒక్కొక్కటిగా బట్టబయలవుతోంది. ఒకప్పుడు ఆముదాలవలస రాజకీయాన్ని ఏలిన తమ్మినేని, ఆయన కుటుంబం చేసిన అడ్డగోలు భూకబ్జాలు, దొంగ రిజిస్ట్రేషన్ల దందాలు ఇప్పుడు వెలుగులోకి వస్తుండటంతో తీవ్ర కలకలం రేగుతోంది. భూకబ్జా, ఫోర్జరీ కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే ఆలస్యం.. ఆయన తన భార్య, కుమారుడితో సహా రాత్రికి రాత్రే పరారవ్వడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.బ్రతికున్న వ్యక్తులను చనిపోయినట్లు చూపిస్తూ, వారి వారసులమంటూ ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూములను కాజేసిన ఒక నకిలీ దస్తావేజుల స్కామ్ వెలుగులోకి వచ్చింది. అసలైన యజమానులు బ్రతికే ఉన్నప్పటికీ, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ కాగితాలు సృష్టించి అడ్డగోలుగా తమ పేరున దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో పోలీసులు విచారణ జరిపి తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్ , తమ్మినేని సీతారాం , ఆయన భార్య తమ్మినేని వాణి లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.అధికారంలో ఉన్న సమయంలో స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని తమ్మినేని కుటుంబం ఆముదాలవలస నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో వేల గజాల ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను, ప్రభుత్వ భూములను భయభ్రాంతులకు గురిచేసి కాజేశారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. బాధిత భూయజమానులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా, నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయనకున్న రాజకీయ ప్రాబల్యం వల్ల పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయడానికి కూడా జంకారు. ఇప్పుడు ప్రభుత్వం మారడం, బాధిత కుటుంబాలు ఆధారాలతో పోలీసులను ఆశ్రయించడంతో తమ్మినేని పాపాల పుట్ట పగిలింది.శాసనసభలో సభాపతిగా విలువలు, నైతికతల గురించి గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చిన తమ్మినేని.. తీరా చూస్తే ప్రైవేటు వ్యక్తుల కష్టార్జితమైన ఆస్తులపై కన్నేసి అక్రమాలకు పాల్పడటంపై ఆముదాలవలస ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఒకప్పుడు అధికారం చూపి బెదిరించిన నేతలు, నేడు కేసు నమోదవ్వగానే చట్టం నుంచి తప్పించుకోవడానికి పరారవ్వడంపై స్థానికులు మండిపడుతుండగా, తవ్వే కొద్దీ తమ్మినేని కబ్జాల లెక్కలు మరిన్ని బయటకు రానున్నట్లు తెలుస్తోంది

**మిస్సింగ్....**
శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మరియు ఆయన కుటుంబ సభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అరెస్ట్ భయంతోనే వారు పరారయ్యారని, ప్రస్తుతం వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలుస్తోంది. చాపురం వద్ద జరిగిన ఈ ల్యాండ్ స్కామ్ వ్యవహారంలో శ్రీకాకుళం రూరల్ పోలీసులు మొత్తం 13 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.ఈ కేసులో తమ్మినేని కుటుంబ సభ్యులను కీలక నిందితులుగా చేర్చారు. ఇందులో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఏ-6 గా, ఆయన భార్య తమ్మినేని వాణిని ఏ-7గా, మరియు వారి కుమారుడు తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్‌ను ఏ-5గా పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం.. చాపురం సత్యసాయి నగర్ లేఅవుట్ పరిధిలో దాదాపు రూ. 4 కోట్ల విలువైన 900 గజాల స్థలంపై ఈ వివాదం నెలకొంది. అసలు భూ యజమాని బతికి ఉండగానే, ఆయన చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించారు.అంతేకాకుండా, ఒడిశాకు చెందిన ఒక మహిళను ఆ యజమాని కుమార్తెగా చూపిస్తూ తప్పుడు వారసత్వ పత్రాల ద్వారా ఈ స్థలాన్ని తమ్మినేని కుమారుడి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆధారాలు లభించాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శ్రీకాకుళం పోలీసులు ఈ కుట్రకు సహకరించిన మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు సహా ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న తమ్మినేని సీతారాం, ఆయన భార్య, కుమారుడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సమాచారం



**గ్రీవెన్స్ లో వృద్ధ దంపతుల ఫిర్యాదు..**
కొద్దిరోజుల కిందట ఓ వృద్ధ దంపతులు తమ్మినేని కుటుంబ సభ్యులపై ఏకంగా కలెక్టరేట్ గ్రీవెన్స్ లోనే ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస టిఎస్ఆర్ కళాశాలకు సమీపంలో ఓ వృద్ధ దంపతులకు 8 సెంట్లు స్థలం ఉంది. అయితే ఆ స్థలాన్ని తమ్మినేని కుటుంబం ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేసిందంటూ ఆ వృద్ధ దంపతులు సీఎంవో తో పాటు ఎస్పీ నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో డిఆర్ఓ విశ్వేశ్వరరావు, ఆమదాలవలస తహసిల్దార్, సర్వే అధికారులు వెళ్లి స్థలాన్ని బాధితులకు అప్పగించారు. అయితే ఇది జరిగి వారం రోజుల వ్యవధి కూడా కాలేదు.. శ్రీకాకుళం లో నాలుగు కోట్ల విలువైన భూమిని అక్రమ మార్గంలో స్వాధీనం చేసుకోవడం వెలుగులోకి వచ్చింది.మరోవైపు టెక్కలి మండలం చింతామణి గ్రామంలో ఏకంగా 23 ఎకరాల భూమిని తన కుమారుడి పేరుతో బలవంతంగా రాయించుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. తమ్మినేని సీతారాం స్పీకర్ గా ఉన్న సమయంలోనే చింతామణి గ్రామంలోని 324 సర్వే నెంబర్ లో భూమిపై ఆయన కన్ను పడినట్లు తెలుస్తోంది. గ్రామస్తులను భయపెట్టి మరి బలవంతంగా రాయించుకున్నారని శ్రీకాకుళం రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో ఆమదాలవలసకు చెందిన ఓ వ్యక్తి తమ్మినేని కుటుంబంతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అయితే ఆయన మరణించిన తర్వాత వారసులు మధ్య గొడవలు జరిగాయి. అయితే వారి ఇల్లును తమ్మినేని సీతారాం భార్య వాణి బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆమదాలవలసకు చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ అనారోగ్యంతో చనిపోయారు. అయితే తమకు కొంత మొత్తం అప్పుగా ఉన్నారని చెప్పి.. ఆయన కుటుంబాన్ని బెదిరించి ఒక ఇల్లును బలవంతంగా లాక్కున్నారని ఆరోపణ కూడా ఇప్పుడు వినిపిస్తోంది. ఇప్పుడు బాధితులు ఒక్కొక్కరు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తుండడంతో తమ్మినేని ఫ్యామిలీ చుట్టూ ఉచ్చు బిగిస్తోంది.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

- నిరసనలను అణచివేసే చర్యలు
- ప్రజాసమస్యలు, విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేయలేని ప్రభుత్వాలు పతనం కాకా తప్పదు
- ప్రధానమంత్రి , కేంద్రాహోంశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి
- డా గార్లపాటి మద్దులేటి స్వామినంద్యాల డిసిసి అధ్యక్షులు

**డోన్ –సూర్య వాస్తవం**
దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న విద్యా సంబంధిత సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా చేపట్టిన నిరసన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారు అరెస్టు చేయబడడాన్ని నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. గార్లపాటి మద్దులేటి స్వామి తీవ్రంగా ఖండించారు.ఈ రోజు పార్టీ కార్యాలయములో అయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలపై, ముఖ్యంగా విద్యార్థుల హక్కుల కోసం ప్రతిపక్ష నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. అలాంటి నిరసనలను అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు.అరెస్టులు, ఆంక్షలు లేదా ఇతర అణచివేత చర్యలతో ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాలను నిలువరించడం సాధ్యం కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థుల సమస్యలు పరిష్కారమై వారికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డీసీసీ కార్యదర్శి గోపినాథ్, డోన్ మండల అధ్యక్షులు పఠాన్ మహమ్మద్ హుస్సేన్, పట్టణ ఉపాధ్యక్షులు హనుమాన్, మైనారిటీ అధ్యక్షులు రహీమ్,నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా, తల్లికి వందనం

**- వై నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంస్ చైర్మన్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**



**కర్నూల్– సూర్య వాస్తవం :** కర్నూలు లోని డీసీఎంస్ కార్యాలయం లో రెండో ఏడాది కూడా తల్లికి వందనం పథకం అమలు చేసిన సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు బొందెల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, క్రిష్ణజిరావు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు మొదలగు నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్బంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ:-ఇచ్చిన హామీని కొనసాగిస్తూ రెండో ఏడాది కూడా తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి 15000 రూపాయలు చెప్పున 67,47,190 మంది విద్యార్థులకు 10.120 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం. తల్లి ఖాతాలో డబ్బులు జమ కాని వారు ప్రభుత్వం మీకు అవకాశాన్ని కల్పించింది. స్థానిక సచివాలయంలో మీ సమస్యను తెలియజేస్తే వారు విచారించి మీకు మరల డబ్బులు పడేటట్లు చేస్తారని. కావున అర్హులైన ప్రతి ఒక్కరికి రావాల్సిన తల్లికి వందనం పథకం నిధులు మీకు ఖచ్చితంగా వస్తాయని ఈ సందర్భంగా తెలియజేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా చేసుకొని రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను అభివృద్ధి చేయడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, విద్యా శాఖ మంత్రి లోకేష్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- వేరుశనగ విత్తనాలను రాయితీ అందించిన బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కె సి మద్దిలేటి**



**ప్యాపిలి– సూర్య వాస్తవం**
నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కె సి మద్దిలేటి, మండల అధ్యక్షులు కె. బి. దామోదర్ నాయుడు బుధవారం జలదుర్గం గ్రామం లో రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం రైతులకు రాయితీ పై అందజేసిన వేరుశనగ విత్తనాలను మంగళవారం రైతులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం ఒక్కో రైతుకి మూడు వేరుశనగ విత్తన పాకెట్లను అందజేస్తుంది అన్నారు. పాకెట్ ధర రూ.1840 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు కె బి దామోదర్ నాయుడు వి హెచ్ ఏ అనూష నాయకులు రైతులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి అండగా కూటమి ప్రభుత్వం

**- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



**అనంతపురం సిటీ–సూర్య వాస్తవం:** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం చారిత్రాత్మక నిర్ణయమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ఏడాది 67 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం జమ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.10,120 కోట్లను విడుదల చేసిందన్నారు.గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక విద్యార్థికే పరిమితమైన పథకం కారణంగా పలువురు విద్యార్థులు నష్టపోయారని, ప్రస్తుతం ఒకే కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకం వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పేద కుటుంబాల పిల్లలు చదువుకు దూరం కాకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గి, విద్యార్థుల్లో చదువుపై మరింత భరోసా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# పార్టీ నాయకులకు భరోసానిచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ సభ్యులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ, సర్వే (ఎన్యూమరేషన్) ప్రక్రియ పూర్తి చేయడానికి మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, ఫారాలు ఇంకా ఇవ్వని వారిని నేరుగా కలిసి ప్రక్రియ పూర్తి చేయించాలని పార్టీ నాయకులకు సూచించారు. అర్బన్ నియోజకవర్గంలో 100 శాతం సర్వే పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని, ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే కార్యక్రమాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ విజయవంతం అయ్యేలా ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్త భాగస్వామి కావాలని, "తల్లికి వందనం" వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మార్పులను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటేనే వారి ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో టీడీపీ జెండా ఎగరేయాలంటే ప్రతి నాయకుడు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని, ఎవరు ఎలా పనిచేస్తున్నారో అధిష్టానం నిరంతరం పరిశీలిస్తోందని చెప్పారు. చివరగా, "మీకు న్యాయం చేసే బాధ్యత నాది" అంటూ పార్టీ నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భరోసా ఇచ్చారు.

# ఏ హోదాలో పని చేసినా ప్రత్యేకత చాటుకోవాలి

**- జెడ్పీ డిప్యూటీ సీఈఓ కృష్ణమూర్తి**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** మనం ఏ హోదాలో పని చేసినా అంకితభావం, చిత్తశుద్ధితో విధులు నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని ఉమ్మడి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మధ్యాహ్నం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సమావేశ మందిరంలో జెడ్పీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమను తాము పరిచయం చేసుకున్నారు.అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను ఉద్యోగులతో పంచుకున్నారు. ఎక్కడ పని చేసినా నిబద్ధతతో, మనస్సు పెట్టి విధులు నిర్వహించడం వల్ల ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నానని తెలిపారు. అదే స్ఫూర్తితో ఇప్పటికీ పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఏ ఉద్యోగమైనా బాధ్యతగా, నిజాయితీగా నిర్వహిస్తే గుర్తింపుతో పాటు వృత్తిలో ఎదుగుదల కూడా సాధ్యమవుతుందని ఆయన ఉద్యోగులకు సూచించారు.

**శుభాకాంక్షల వెల్లువ**

డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జెడ్పీ ఉద్యోగులు కృష్ణమూర్తికి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోగుల వీల్ ఛైర్‌పై బయోమెడికల్ వ్యర్థాలు

- అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం
- వైద్యశాఖ మంత్రి జిల్లాలోనే ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి
- రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లే నిరుపేదల పరిస్థితి ఏమిటి?
- అధికారుల నిర్లక్ష్య వైఖరికి చర్యలు లేవా?
- ఇంకా ఎంతకాలం అధికారులపై ఈ మెతక వైఖరి?






**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో నిత్యం వందల మంది సుదూర ప్రాంతాల నుండి మధ్యతరగతి, నిరుపేదలు వైద్యం నిమిత్తం వస్తూ వుంటారు. కానీ ఇక్కడ పరిస్థితి రోగుల భద్రత, పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. రోగులను తరలించేందుకు వినియోగించే వీల్‌ఛైర్లపైనే ప్రమాదకర బయోమెడికల్ వ్యర్థాలను తరలించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. నిబంధనల ప్రకారం బయోమెడికల్ వ్యర్థాల రవాణాకు ప్రత్యేక ట్రాలీలు, మూసివేసిన కంటైనర్లను మాత్రమే వినియోగించాలి. అయితే వాటిని విస్మరించి, 'బయో హజార్డ్' గుర్తులు ఉన్న వ్యర్థాల సంచులను వీల్‌ఛైర్లలో తరలించిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. అనంతరం అదే వీల్‌ఛైర్లను రోగులకు ఉపయోగిస్తే ప్రమాదకర ఇన్ఫెక్షన్లు వ్యాపించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో వీల్‌ఛైర్ల కొరత కారణంగా రోగుల బంధువులు, సిబ్బంది మధ్య వివాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న వీల్‌ఛైర్లను ఈ విధంగా వినియోగించడం మరింత విమర్శలకు దారితీస్తోంది.

వైద్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి పరిస్థితులు నెలకొంటే, రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఎలా ఉంటుందోనని రోగులు, వారి బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 21న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ భవాని రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆసుపత్రి పారిశుద్ధ్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనప్పటికీ, అధికారుల నిర్లక్ష్య వైఖరిలో మార్పు కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ ఘటనపై స్పందించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, ఆసుపత్రిలో పారిశుద్ధ్య లోపాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏజెన్సీపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల్లో పరిస్థితిని పూర్తిగా మెరుగుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో చేర్చుతామని హెచ్చరించారు.



సుమారు 1,200 మందికి పైగా ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇలాంటి నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తలనొప్పిగా మారిన ఓటర్ల మ్యాపింగ్

- ఒత్తిడిలో తప్పిదాల ముప్పు..
- 2002 జాబితా వివరాలే కీలకం



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. మ్యాపింగ్ పూర్తి చేయాలంటే 2002 ఓటర్ల జాబితా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి వస్తోంది. అవి లేకపోతే మ్యాపింగ్ పూర్తికావడం లేదు. దీంతో లక్ష్యాలు చేరుకోవాలనే ఒత్తిడిలో కొంతమంది బీఎల్వోలు సరైన ధృవీకరణ లేకుండానే పేర్లను జతచేస్తున్నట్లు సమాచారం.

ఈ పరిస్థితి కొనసాగితే ఈ నెల 31న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో భారీగా తప్పులు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 20,38,523 మంది ఓటర్లలో 18,14,147 మంది (88.99 శాతం) వివరాలను డిజిటలీకరణ చేశారు. మృతులు, శాశ్వత వలసలు, చిరునామా లభించని వారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన 2,24,376 మంది వివరాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. డిజిటలీకరణ పూర్తైన వారిలో ఇప్పటివరకు 81.11 శాతం మ్యాపింగ్ పూర్తికాగా, మరో 1,60,612 మంది (7.88 శాతం) ఓటర్ల మ్యాపింగ్ మిగిలి ఉంది. ఎనిమిది నియోజకవర్గాల్లో అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 22.95 శాతం మ్యాపింగ్ పెండింగ్‌లో ఉండగా, తాడిపత్రి (10.01శాతం), ఉరవకొండ (6.84శాతం), శింగనమల (6.09శాతం) నియోజకవర్గాలు తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఓటర్ల మ్యాపింగ్‌కు ఈ నెల 24వ తేదీతో గడువు ముగియ నుండటంతో జిల్లా యంత్రాంగం లక్ష్య సాధనపై దృష్టి పెట్టింది. కలెక్టర్ నుంచి బీఎల్వో వరకు రేయింబవళ్లు శ్రమిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అనేక సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈఎఫ్‌ల పంపిణీ, స్వీకరణ, డిజిటలీకరణ దశల్లో జరిగిన లోపాల ప్రభావం ఇప్పుడు మ్యాపింగ్‌పై పడుతోంది.ముఖ్యంగా 2002 ఓటర్ల జాబితా వివరాలు లేకపోయినా గతంలో దరఖాస్తులు స్వీకరించడంతో, ప్రస్తుతం అదే అంశం మ్యాపింగ్‌కు అడ్డంకిగా మారింది. వంద శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలనే ఒత్తిడిలో తప్పులు జరిగే అవకాశం ఉండటంతో, తుది ఓటర్ల జాబితా ఖచ్చితత్వంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయలసీమకు జీవనాధారం

# తుంగభద్ర సమాంతర కాలువ

**- హైపవర్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి**



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే తుంగభద్ర సమాంతర (వరద) కాలువ నిర్మాణంతో పాటు రాయలసీమలో ప్రవహించే నదుల అనుసంధానం అత్యవసరం. వైస్సార్సీపీ రాయలసీమ రీజినల్ అధికార ప్రతినిధి,కె.వి. రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో సమతుల అభివృద్ధి కోసం అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకపోతే ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.జూలై 27న ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరగనున్న తుంగభద్ర హై పవర్ కమిటీ సమావేశంలో తుంగభద్ర సమాంతర కాలువ నిర్మాణాన్ని ప్రధాన అజెండాగా చర్చించాలి. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై కేంద్రాన్ని, అలాగే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను ఒప్పించేలా కృషి చేయాలి. తుంగభద్ర ఎగువన నిర్మితమవుతున్న ప్రాజెక్టులు, డ్యామ్‌లో పెరిగిన పూడిక, దిగువ ప్రాంతాలకు అందాల్సిన నీటి తగ్గుదల వంటి అంశాల ప్రభావం రాయలసీమపై తీవ్రంగా పడుతోంది. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వరద నీటిని వినియో గించుకునే ప్రత్యామ్నాయ వ్యవస్థలు అవసరం. తుంగభద్ర సమాంతర కాలువ ద్వారా వరద సమయంలో వృథాగా వెళ్లిపోయే నీటిని నిల్వ చేసి, గ్రావిటీ ద్వారా రాయలసీమ పశ్చిమ ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంది. దీనివల్ల సాగునీటి లభ్యత పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి భూగర్భ పైపులైన్ వ్యవస్థ ద్వారా నీటి నష్టాన్ని తగ్గించే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలించాలి.అదే విధంగా ఆల్మట్టి--బుక్కపట్నం వరద కాలువ, గుండ్రేవుల, వేదవతి, సిద్ధేశ్వరం--అలుగు వంటి ప్రాజెక్టులకు కూడా కేంద్ర అనుమతులు, సహకారం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి. కృష్ణ, తుంగభద్ర, వేదవతి, పెన్నా, చిత్రావతి, పాపాగ్ని, మద్దిలేరు వంటి నదుల అనుసంధానం ద్వారా రాయలసీమకు దీర్ఘకాలిక జల భద్రత కల్పించవచ్చు.అని సూర్య వాస్తవంకి ఇచ్చిన ప్రెస్‌నోట్‌లో తెలియజేశారు



## అనంతలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** భారతదేశం గర్వించదగ్గ మహా ఇంజినీర్, భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని అనంతపురంలోని పంచాయతీరాజ్ సర్కిల్ (పీఆర్ఎస్‌సీ) కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వై. చిన్న సుబ్బరాయుడు, ఈఈ రాజన్న, పీఐయూ ప్రాజెక్ట్ ఈఈ భాస్కర్, సబ్ డివిజన్–1 డీఈఈ లక్ష్మీనారాయణ తదితర అధికారులు బృందంగా ఏర్పడి విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ వై. చిన్న సుబ్బరాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం పీఆర్ఎస్‌సీ కార్యాలయ రూపురేఖలు మారుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు.

# ఎల్‌నినో ప్రభావం- డిసెంబర్ వరకు తక్కువ వర్షపాతం!

**- స్వల్పకాలిక పంటల సాగుపై అధికారుల సూచన**




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఎల్ నినో ప్రభావంతో వచ్చే డిసెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హెచ్చరించారు. రైతులు తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను సాగు చేసి, పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని చిన్నముష్టూరులో ఏవో రామకృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో ఏడీఏ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఖరీఫ్ పంటలకు బీమా చేయించుకుంటే నష్టాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చన్నారు. వాతావరణ బీమా కింద వేరుశనగకు ఎకరాకు రూ.640, ఫసల్ బీమా కింద కందికి ఎకరాకు రూ.80 చెల్లించాలని వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చెన్నరాయుడు మాట్లాడుతూ, డిసెంబర్ వరకు సుమారు 60 శాతం వర్షపాతం లోటు ఉండే అవకాశముందని తెలిపారు. ఆగస్టు 15 వరకు కంది, వేరుశనగ విత్తుకోవచ్చని, అప్పటికీ వర్షాలు లేకపోతే ఉలవలు, జొన్నలు, గడ్డి జొన్నలు, గడ్డి సజ్జలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏవో రామకృష్ణుడు మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి రైతు 11 అంకెల ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, ఈ-పంటలో పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే యూరియా, డీఏపీ ఎరువులను యాప్ ద్వారా నమోదు చేసి కొనుగోలు చేయాలని తెలిపారు. అనంతరం అధికారులు గ్రామ రైతు చంద్రశేఖర్ సాగు చేసిన కంది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసులు, గ్రామ ఉద్యాన సహాయకుడు గిరీష్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై సమీక్ష

**శింగనమల - సూర్య వాస్తవం :** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అధికారులతో, పార్టీ నాయకులతో, ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నాయకులు, ప్రజలు తమ ప్రాంతాలకు సంబంధించిన వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు.

## మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డిని పరామర్శించిన వైసీపీ నాయకులు



**కూడేరు - సూర్య వాస్తవం:** కూడేరు మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించు కుని పుట్టపర్తిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న ,కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, అడ్వొకేట్ నాగార్జున్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, తదితరులు కలిసి బైరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బైరెడ్డి రామచంద్రారెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## క్రిస్టియన్ పాస్టర్ల సంక్షేమానికి రూ.3 లక్షల విరాళం



**కదిరి - సూర్య వాస్తవం :** బుధవారం పట్టణంలోని అడపాల వీధి లో ఉండే మన్రో కమ్యూనిటీ భవనం నందు బ్రదర్ జోసెఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కదిరి డివిజన్ పాస్టర్ల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిమ్స్ హాస్పిటల్ ఎండి ఎన్ వైఎస్‌పిఎన్ వ్యవస్థాపకుడు నిసార్ యాసిన్ వారి కుటుంబ సంక్షేమం కోసం 3 లక్షల రూపాయలు సంక్షేమ నిధిని ప్రకటించారు. అంతే కాక పాస్టర్ల కుటుంబాలలో వివాహాలకు తనవంతు సహాయం చేస్తానని వారికి అనారోగ్య పరిస్థితులు ఎదురైన ఆర్థికంగా అండగా ఉంటానని తెలియజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు బ్రదర్ మృత్యుంజయ రావు, బ్రదర్ చెన్నారెడ్డి, బ్రదర్ విల్సన్, బ్రదర్ బాబు భగవాన్ దాస్‌లు నిసార్ యాసీన్ సేవా గుణాలను మెచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీటర్, వివిధ చర్చిల పాస్టర్‌లు, క్రిస్టియన్ మతపెద్దలు, ఎన్‌వైఎస్‌పిఎన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీఈవోల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**- సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప**
**- ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు**
**- గత ఐదు రోజులుగా ఉద్యమం చేస్తున్న పట్టించుకోని అధికారులు**




**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఎంపీఈవోల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఎంపీఈవోలు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆయన మద్దతు తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని సందర్శించిన ఓ. నల్లప్ప మాట్లాడుతూ, ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో గత 12 సంవత్సరాలుగా ఎంపీఈవోల వేతనాలు పెంచక పోవడం అన్యాయమని అన్నారు. ఎంపీఈవోలకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని, నాన్-శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చి రెగ్యులర్ చేయాలని, ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, ఈహెచ్ఎస్ వైద్య సదుపాయాలు కల్పించి, వారి న్యాయమైన డిమాండ్లన్నింటినీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ క్షేత్రస్థాయి ప్రదర్శన




**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలంలోని కల్లూరు అగ్రహారం పొలంలో అగ్రికల్చర్ ఏ డిఏ వెంకట్ కుమార్ మెలకువలు వరికి నీటిని తడులుగా ఏ విధంగా ఇవ్వాలని, ఏడిఎ వెంకట్ కుమార్ ఏవో సోమశేఖర్ ఏఈఓ హరి, విఎఎ శ్రీజ, రైతులకు వరిలో నీటి తడులు పద్ధతిపై 30ఇంచుల పైపు నాలుగించుల పైపుతీసుకుని దానికి 15 ఇంచులు చిన్న రంధ్రాలు వేసి ఆరు లైన్లో రంధ్రములు వేసి వరి నాటిన మడిలో 15 ఇంచులు భూమిలో మునిగేటట్లు పెట్టి మట్టిని తీసివేసి పైపులో వాటర్ చిన్న హోల్స్ ఇచ్చిన 4లైన్ల వరకు వాటర్ తగ్గినచో అప్పుడు తడిగా ఇవ్వాలి వరి పంట దిగుబడి వస్తుంది. అలాగే నీటి ఎత్తడి తగ్గుతుంది నీటిని పొదుపుగా వాడుకునే పద్ధతిలో రైతులకు సూచనగా ఇవ్వడం జరిగింది. ఎల్‌నీనో ప్రభావం వలన ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉండటం వలన రైతులకు పంటలు ఏపంటలు పెట్టుకోవాలని ఆరుతడి పంటలు పెట్టుకోండి అని రైతులకు అవగాహన తెలియజేయడం జరిగినది.ఆరుతడి పంటలు వేసుకోవాలని ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు వరివెంకటేశ, చంద్ర, వాసు, దివాకర్, రామచంద్ర, బ్రహ్మానందరెడ్డి, రామాంజులరెడ్డి తదితర రైతులు పాల్గొనడం జరిగినది.

## వంట చేస్తూ డాక్యుమెంట్ రైటర్ల నిరసన



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో డాక్యుమెంట్ రైటర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుత్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా బుధవారం డాక్యుమెంట్ రైటర్లు వంటచేసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు .డాక్యుమెంట్ రైటర్ బండి సత్య మాట్లాడుతూ 396 జీవో ప్రకారం రిజిస్ట్రేషన్ సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే డాక్యుమెంట్ రైటర్లు ఎలా బతకాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

## సుమారు 7 లక్షల విలువజేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం

**- హౌస్ బ్రేకర్ అరెస్ట్**
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు వివరాలు వెల్లడించిన అనంతపురం నాల్గవ పట్టణ, సిసిఎస్ పోలీసులు**



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఫోర్త్‌టౌన్ ఉ సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువ చేసే 3.14 తులాల బంగారు నగలు, 203.5 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.80 వేల నగదు, టీవీ, గ్యాస్ సిలిండర్, నాలుగు చేతి గడియారాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సి.ఐలు మస్తాన్, జయపాల్ రెడ్డి, ఎస్సై గోపిల కథనం ప్రకారం... స్థానిక కక్కలపల్లి కాలనీకి చెందిన బలిజ సాయి కిరణ్ (26) మద్యం, జూదం వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలను ఎంచుకున్నాడు. పగటిపూట తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రివేళల్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులను అపహరించేవాడు. ఈ ఏడాది జూన్ నెల నుంచి అనంతపురం నగరం, పరిసర ప్రాంతాల్లో మూడు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు, అనంతపురం అర్బన్ సబ్ డివిజనల్ ఆఫీసర్ ఇన్‌చార్జి అదనపు ఎస్పీ మహబూబ్ బాష పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ జయపాల్ రెడ్డి, ఫోర్త్‌టౌన్ సీఐ ఏ.పీ. మస్తాన్, ఎస్సై గోపీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కేశవరెడ్డి పాఠశాల సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేసింది. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

## బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పనిచేద్దాం

**- మండల అధ్యక్షుడు అంజి నాయక్**



**పామిడి - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పామిడిలో బిజెపి మండల అధ్యక్షుడు చౌహాన్ అంజినాయక్ ఆధ్వర్యంలో బిజెపి మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. పొగుల నాగేంద్ర బాబు అనంతపురం బిజెపి జిల్లా కార్యదర్శి, పామిడి మండల ఇంచార్జ్ హాజరయ్యారు ఈ సందర్భంగా నాగేంద్ర బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త వ్యక్తిగత విమర్శలు కాకుండా కమలం గుర్తు కోసమే పనిచేయాలని పిలుపునిచ్చారు ప్రతి నెలా మండల సమావేశాలు నిర్వహించాలని, ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. ప్రతి వారం కచ్చితంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అక్కడ పనివిధానాలను తెలుసుకొని జిల్లా పార్టీకి నివేదిక ఇవ్వాలన్నారు. పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని కోరారు. మనలో ఒకరిపై కోపంతో కాకుండా కలిసికట్టుగా పనిచేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. "నేను ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్నాను. పార్టీపరంగా ఏ సమస్యలున్నా నా దృష్టికి తీసుకొస్తే జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు ఎం. కుమారస్వామి, కే.రామ నరేష్, ఉపాధ్యక్షులు మల్లికార్జున ఆచారి, వై. సుందరయ్య, యాతం వెంకట్రాం రెడ్డి, కార్యదర్శులు మంజునాథరావు, నగరూరు బాల్కొండ మల్లికార్జున, శ్రీనివాసులు ఆనంద్, శేషాద్రి, ఎన్.వి. సుబ్రహ్మణ్యంచాణిక్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అనంతపురం ఎస్పి జగదీశ్ ఐ పీస్ సూచనల మేరకు,గుంతకల్ ఎ స్డీపీవో శ్రీనివాస్ మరియు సీఐ రా మారావు గుత్తి పోలీస్ స్టేషన్ సిబ్బం ద ఆధ్వర్యంలో ఈ రోజు 22/07/2 026 వ తేదీ,గుత్తి టౌన్ లోని, జడ్పీ (గర్ల్స్) స్కూల్‌లో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారికీ డ్ర గ్స్(గంజాయి) వా డితే కలిగే దు ష్ప్రభావాలు, మహిళ లపై జరుగు నేరాలు,పిల్లలపై జరుగు నేరాలు, పోక్సో (పివోసిఎస్ వో ) చట్టం, బాల్యవివాహాలు, సైబర్ మోసాలు, రోడ్డు భద్రత సూత్రాలు,స్త్రీరక్ష యాప్ మొదలగు వాటిపై అవగాహ న కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అలాగే అప్రమత్తంగా ఉండాలని,అలా గే వారి కుటుంబ సభ్యులకు కూడా పై విషయాలు తెలియజేసి, వారు కూడా అప్రమత్తంగా ఉండేటట్లుచూ డాలి అని తెలియపరిచారు. అటువంటి సంఘటనలు ఏవైనా జరిగితే వాటి గురించి పోలీస్ వారికీ తెలియజేయాలని వారికి సూచించామన్నారు.

# నీట్ అక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**- రాహుల్ గాంధీపై పోలీసుల దురుసు వైఖరిని ఖండిస్తున్నాం**

**- ఏపీ పీసీసీ జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్**



**రాయచోటి–సూర్య వాస్తవం:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, యువతపై పోలీసులు వ్యవ హరించిన తీరుపై ఏపీ పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్ష నాయకు లను పోలీసులు బలవంతంగా అడ్డుకోవడం అంటే ప్రజాస్వామ్యానికి ఖూనీ చేయడమే అని ఆయన అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో జరిగిన నిరస నలో రాహుల్ గాంధీపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం వల్ల ఆయనకు గాయాలు కావడం దేశ ప్రజలను కలచివేసిందని ఆయన చెప్పారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాలరాస్తూ విద్యార్థులు, యువత, కాంగ్రెస్ కార్య కర్తలను అదుపులోకి తీసుకోవడం, నిర్బంధించడం అత్యంత ఖండనీయమని అన్నారు. పేపర్ లీక్ అవ్వడానికి బాధ్యులు ఎవరో కేంద్ర ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు.

# నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం దుర్మార్గం

**- అన్నమయ్య డిసిసి చీఫ్ అమీర్ బాషా**



**రాయచోటి – సూర్య వాస్తవం:** నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలో విద్యార్థుల పక్షాన పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ అరెస్ట్‌ను డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్ బాషా తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపు తున్న రాహుల్ గాంధీని, ఇతర ప్రతిపక్ష నాయకులను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ''విద్యార్థుల భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో న్యాయం కోసం పోరాడు తున్న రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచిన టి.వి.కె పార్టీ అధినేత, తమిళనాడు ముఖ్య మంత్రి విజయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. నీట్ రద్దుపై రాహుల్ గాంధీ అరెస్ట్‌కు వ్యతిరేకంగా విజయ్ ధైర్యంగా స్పందించి మద్దతు తెలపడం అభినందనీయం." విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న నీట్ విధానాన్ని వెంటనే పునఃపరిశీలించి రద్దు చేయాలి.అక్రమంగా అరెస్ట్ చేసిన ప్రజాస్వామ్య నాయకులను వెంటనే విడుదల చేయాలి. పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.

# ఎర్రంపల్లి-గొడ్లవీడు కాలువ పూడికతీత పనులకు శ్రీకారం

**- రైతు సంక్షేమమే లక్ష్యం.. - సాగునీటి అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం మండలం ఎర్రంపల్లి మడేరు నుంచి గొడ్లవీడు మారుతమ్మ చెరువుకు వెళ్లే కాలువ పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. నీటి సంగం చైర్మన్ లగసాని వీరయ్యతో పాటు టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలువ పూడికతీతతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరిగి సాగునీరు చివరి ఆయకట్టు వరకు సకాలంలో చేరుతుందని తెలిపారు. దీంతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి వ్యవసాయ దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వారు స్పష్టం చేశారు.

# “ఇంటింటికీ యోగా”పై కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం

- 365 రోజుల పాటు యోగా కార్యక్రమాలు జరిగేందుకు వీలుగా ప్రతిపాదనలు
- పాఠశాలల్లో వారానికి రెండు రోజులు యోగా తరగతులు నిర్వహించే యోచన
- యోగా మందిరాలుగా సచివాలయాలు
- సంజీవని తో అనుసంధానం కూడా
- ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** యోగాను అంతర్జాతీయ యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా.ఏడాది పొడవునా ప్రజల జీవన విధానంలో భాగస్వామ్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది.''ఇంటింటికీ యోగా'' పేరుతో 365 రోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగించేందుకు వీలుగా ప్రణాళికలు ప్రభుత్వం రూపొందించబోతుంది.గ్రామ,వార్డు సచివాల యాలను''యోగా మందిరాలు''గా గుర్తించి ప్రజలకు 15 రోజుల ప్రాథమిక శిక్షణ ఇవ్వడం, అనంతరం మూడు నెలలపాటు ఇంటివద్ద సాధన చేయించడం ఈ ప్రణాళికలో కీలకం.మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి వ్యాధులవారీగా చికిత్సాత్మక యోగా విధానాలను అవలంబించేలా చేయను న్నారు. సంజీవని పథకం కింద జరిగే ఆరోగ్య పరీక్షల్లోనూ యోగాసనాలను అనుసంధానం చేయబోతున్నారు.ఈ కార్యాచరణ రూపకల్పన గురించి రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు తొలి సమావేశం ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఐఏఎస్ అధ్యక్షతన బుధవారం విజయవాడ లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఇంటింటి యోగా కార్యక్రామాలు ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంకా మరికొన్ని సమావేశాలు జరుగను న్నాయి. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రతిపాదనలను మంత్రివర్గం ముందుకు తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

**సచివాలయం నుంచే యోగ శిక్షణ**

కార్యాచరణ ప్రణాళికలో ఉంచాల్సిన అంశాలపై జరిగిన చర్చ ప్రకారం.ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వ్యవస్థలనే వినియోగించనున్నారు.గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులను యోగా మందిరాలుగా గుర్తించనున్నారు. కొత్త భవనాలు,ప్రత్యేక సిబ్బంది కోసం ఎదురుచూడకుండా ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు,ఉద్యోగులతోనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు.ప్రతి యోగా మందిరంలో 15 రోజులపాటు ఏకరీతి ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం మూడు నెలలు ఇంటివద్ద సాధన కొనసాగించేలా ప్రోత్సహిస్తారు. నెలకోసారి లేదా రెండు నెలలకోసారి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారు. నిర్దేశించిన సాధన పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది.గ్రామస్థాయిలో కార్యక్రమాన్ని విస్తరించేందుకు మధ్యస్థాయి ఆరోగ్య సేవల ప్రదాతలు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, ఆయుష్ శిక్షకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. బీఎన్‌వైఎస్, యోగాలో ఉన్నత విద్య పూర్తిచేసిన నిపుణులతో రాష్ట్రస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసి శిక్షణ విధానాలు,నాణ్యతా ప్రమాణాలు, జిల్లాలవారీ కార్యాచరణ రూపొందించనున్నారు.

**వ్యాధులవారీగా ప్రత్యేక సాధన**

సంజీవని పరీక్షల్లో మధుమేహం,అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారందరికీ ఒకే విధమైన యోగా సూచించకుండా.. వారి వయసు,వ్యాధి తీవ్రత,ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ప్రత్యేక సాధన విధానాలను రూపొందించనున్నారు.

**పాఠశాలల్లో యోగా తప్పనిసరి**

పాఠశాలల్లో వారానికి రెండు రోజులపాటు యోగా తరగతులు నిర్వహించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది.వ్యాయామ ఉపాధ్యాయులు ఆరు నెలల ధ్రువీకృత యోగా కోర్సును పూర్తి చేసేలా విద్యాశాఖతో కలిసి విధివిధానాలు రూపొందించనున్నారు.విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యం,భావోద్వేగ సమతుల్యత పెంపొందించే అంశాలను పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వ యోగా,ప్రకృతి వైద్య సలహాదారు శ్రీ మంతెన సత్యనారాయణ రాజు గారు సూచించారు.జిల్లాల్లో ఇప్పటికే శిక్షణ పొందిన యోగా మాస్టర్ల సేవలను ఈ కార్యక్రమంలో వినియోగించు కోవాలని ప్రతిపాదించారు. సచివాలయాలను యోగా మందిరాలుగా వినియో గించేందుకు పంచాయతీరాజ్ శాఖ, పాఠశాలల్లో యోగా అమలుకు విద్యాశాఖ,డిజిటల్ వేదిక ఆధునికీకరణకు సమాచార సాంకేతిక శాఖతో సమన్వయం చేయనున్నారు.

**చరవాణిలోనే యోగా గురువు**

ప్రస్తుతం ఉన్న''యోగాంధ్ర''పోర్టల్‌ను పూర్తిగా ఆధునికీకరించి ప్రజలు, ధ్రువీకృత యోగా శిక్షకులను నేరుగా అనుసంధానించే ఏకీకృత వేదికగా తీర్చిదిద్దనున్నారు. ప్రజలు తమ ప్రాంతంలో అందుబాటులో ఉన్న శిక్షకుల వివరాలను చూసి సేవలను నమోదు చేసుకునే అవకాశం పోర్టల్ లో కనిపిస్తారు.

**గర్భిణిలకు యోగాసనాల ప్రాధాన్యత తెలిపేలా**

ఎంపికచేసిన యోగాసనాలు వేయడం ద్వారా గర్భిణిలకు ప్రసవ సమయంలో సులువుగా ఉంటుందని,సహజ ప్రసవాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని,వీటిపై గైనిక్ వైద్యులు,నర్సులకు అవగాహన కల్పించడం ద్వారా ఫలితాలు బాగుంటాయి.–క్షేత్ర స్థాయిలో ఉండే ఆశా, ఎ.ఎన్.ఎం.,ఎంఎల్‌హెచ్ పిలకు కూడా యోగాసనాలపై అవగాహన కల్పించి,శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణులకు మరింత చేరువవుతుంది.

“పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులను కూడా భాగస్వాములను చేయాలి”

–ఇంటింటి యోగా కార్యక్రమాల కింద ప్రత్యేకంగా “పోర్టల్”ను రూపొందించి,అందులో యోగాంధ్ర కార్యకలాపాల వివరాలు కూడా తెలుసుకునే అవకాశం కల్పించాలి.

–పాఠశాల విద్య నుంచే పిల్లలకు యోగాసనాల ప్రాధాన్యత తెలిపేలా బోధన జరగాలి

–యోగా అండ్ పంచకర్మ కలిపి శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఈ శిక్షణ కార్య క్రమాలు విస్తృత స్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి.–ఆయుష్ వైద్యులకు తప్పనిసరిగా యోగాసనాలపై ఒరియంటేషన్ ద్వారా వారు పనిచేసే ఆసుపత్రుల ద్వారా యోగా ప్రజలకు మరింత చేరువవు తుంది. –వ్యాధులవారీ యోగా వీడియోలు, ఇంటివద్ద సాధనకు అవసరమైన సూచనలు,శిక్షణ కేంద్రాల సమాచారం కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలి.–దీనిని రియల్‌టైమ్ గవర్నెన్స్ వ్యవస్థతో అనుసంధా నించేందుకు సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి స్థాయిలో ప్రత్యేక సమీక్ష జరగాలి. –కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ,మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ సహకారాన్ని కూడా ప్రభుత్వం తీసుకోనుంది. ఈమేరకు కేంద్రానికి త్వరలో అధికారులు లేఖ రాయనున్నారు. సమావేశానికి హాజరైన యోగా అసోసియేషన్ల ప్రతినిధులు. విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ శాఖాధిపతి కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రాథమిక సమావేశంలో ఈ కార్యాచరణపై చర్చించారు. ఆయుష్ సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ,ఐఏఎస్ అధ్యక్షత వహించిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, ఆయుష్ అధికారులు,విశ్వ ఆయుర్వేద పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాహితీ,సీనియర్ ఆయుర్వేద వైద్యులు సుబ్రహ్మణ్యం(ప్రభుత్వ ఎంప్యానల్డ్ హాస్పటల్),జిప్సీ,యోగిపై,యోగాంధ్ర స్టార్టప్,హాబిల్డ్,ఇతర అసోసియేషన్ల ప్రతినిధులు లోచన్,ఇతరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్‌లో నాణ్యత, పరిశుభ్రతకు రాజీపడొద్దు

**- కొండపేట స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.చెరుకూరి శ్రీధర్**




**చెన్నూరు – సూర్యవాస్తవం :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రతకు ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. చెన్నూరు మండలంలోని కొండపేట స్మార్ట్ కిచెన్‌ను గురువారం సాయంత్రం సందర్శించిన ఆయన వంటశాల, ముడి సరుకుల నిల్వ కేంద్రం, కూరగాయల శుభ్రపరిచే విభాగం, ఆహార తయారీ విధానం, ప్యాకింగ్, రవాణా వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార తయారీ ప్రక్రియలో పాటిస్తున్న ప్రమాణా లను తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించడమే స్మార్ట్ కిచెన్ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒకే కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి నిర్ణీత సమయానికి పాఠశాలలకు సరఫరా చేయడం ద్వారా ప్రతి విద్యార్థికి ఒకే నాణ్యతతో కూడిన భోజనం అందుతుందని తెలిపారు. ఆహార తయారీలో ఉపయోగించే బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనె తదితర ముడి సరుకుల నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు హెయిర్ క్యాప్‌లు, గ్లౌజులు, యూనిఫామ్‌లు తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. ఆర్ఓ నీటిని మాత్రమే వినియోగించడం, ఆవిరి (స్టీమ్) ద్వారా వంట చేయడం, పరిశుభ్రమైన పాత్రల్లో ప్యాకింగ్ చేయడం, ఆహార నమూనాలను భద్రపరచడం, నాణ్యత పరీక్షలు నిర్వహించడం, మొత్తం ప్రక్రియను సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం వంటి చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. చెన్నూరు మండలం లోని 41 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 2,040 మంది విద్యార్థులకు ట్రయల్ రన్‌లో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని విజయవంతంగా తయారు చేసి సరఫరా చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇదే నిబద్ధతతో భవిష్యత్తులో కూడా నాణ్యత, పరిశుభ్రత, సమయపాలనను కొనసాగించాలని సూచించారు.



స్మార్ట్ కిచెన్ ద్వారా ప్రతిరోజూ విద్యార్థులకు సమతుల్య పోషకాహారం అందించడంతో పాటు ఆహార వృథాను తగ్గించడం, భోజన సరఫరాలో సమయపాలన పాటించడం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విధానం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో స్మార్ట్ కిచెన్ నోడల్ అధికారి విజయకుమార్, డిప్యూటీ ఈఈ లక్ష్మీ నరసింహులు, తహసీల్దార్ విజయకుమారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. కిరణ్ మోహన్ రావు, ఎంఈఓ--1, ఎంఈఓ--2 సునీత, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, వెలుగు ఏపీఎం వెంకటేష్, స్మార్ట్ కిచెన్ చెఫ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అఖిల్ నెక్స్ట్..

# లెనిన్ జోష్ కంటిన్యూ అవ్వాలంటే..

ఒక విజయం ఇచ్చే జోష్ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా చాలా కాలంగా ఎదురుచూసిన సక్సెస్ వచ్చినప్పుడు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ మరింత పెరుగుతుంది. ఇప్పుడు అక్కినేని యంగ్ హీరో అఖిల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. లెనిన్ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న అఖిల్.. అదే జోష్‌ను తన తదుపరి సినిమాలతో కూడా కొనసాగించాలని చూస్తున్నారు. అయితే ఆ జర్నీలో అఖిల్ తీసుకునే నిర్ణయాలే చాలా కీలకంగా మారనున్నాయి. అఖిల్ కెరీర్ మొదటి నుంచి అంచనాలతోనే సాగింది. అక్కినేని కుటుంబం నుంచి వచ్చిన హీరో కావడంతో ఆయనపై మొదటి సినిమా నుంచే ప్రత్యేకమైన ఆసక్తి ఏర్పడింది. అయితే తొలి ప్రయత్నాల తర్వాత ప్రేక్షకుల అంచనాలకు తగ్గ విజయాన్ని అందుకోవడానికి కొంత సమయం పట్టింది. ఈ క్రమంలో విభిన్నమైన కథలను ప్రయత్నిస్తూ తనను తాను ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు లెనిన్ విజయంతో



అఖిల్ కు కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ సినిమా ఇచ్చిన నమ్మకంతో తదుపరి సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఒక సినిమా విజయాన్ని కొనసాగించడం అనేది హీరో కెరీర్ లో అత్యంత ముఖ్యమైన దశగా ఉంటుంది. లెనిన్ తర్వాత అఖిల్ ముందున్న ప్రధాన సవాల్.. మరో మంచి కథను ఎంచుకోవడమేనని చెప్పాలి. ఒక సినిమా విజయాన్ని దృష్టిలో పెట్టుకుని.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చే కథలను ఎంచుకోవడం అవసరం. ఒక హీరోకు సరైన సమయంలో సరైన కథ దొరికితే కెరీర్ లో పెద్ద చేంజ్ తీసుకురాగలదు. ప్రస్తుతం ప్రేక్షకుల టేస్ట్ లు కూడా మారుతున్నాయి. కేవలం హీరో ఇమేజ్ ను నమ్ముకుని సినిమాలు చూసే పరిస్థితి తగ్గింది. కథ, స్క్రీన్ ప్లే, పాత్రలో కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. అందుకే అఖిల్ కూడా తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో కథకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# మెప్పించే 'కొరియన్ కనకరాజు

హీరో వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబోలో తెరకెక్కుతున్న హర్రర్ , కామెడీ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఎంటర్‌టైనింగ్ టీజర్, చార్ట్‌బస్టర్‌గా నిలిచిన తొలి పాట 'కంసహామ్నిదా' సినిమాపై ప్రేక్షకుల్లో బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'రాసా గుమ్మడి' ని విడుదల చేశారు. తొలి పాటలో కనిపించిన కొరియన్ ఫ్లేవర్‌కు పూర్తి భిన్నంగా, ఈసారి స్వచ్ఛమైన తెలుగు జానపద శైలిలో ఈ పాట కట్టిపడేసింది. ఎస్. తమన్ స్వరపరిచిన ఈ పాటలో ఎనర్జిటిక్ బీట్స్, గ్రామీణ సంగీత వాయిద్యాలు, పండుగ వాతావరణాన్ని గుర్తు చేసే ఫోక్ వైబ్స్ కలగలిసి పూర్తి స్థాయి ఎంటర్‌టైనింగ్ మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నాయి. పాట ప్రారంభంలో హీరోని వన్నె రాయుడు అంటూ హీరోయిన్ ఆప్యాయంగా పలకరించడంతో మొదలై, ఆ తర్వాత ఫుల్ ఎనర్జీతో సాగే ఫోక్ సెలబ్రేషన్‌గా మారుతుంది. నల్గొండ గద్దర్ తన ప్రత్యేకమైన వాయిస్ తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లగా, కాసర్ల శ్యామ్ అందించిన క్యాచీ లిరిక్స్ గ్రామీణ జాతర వాతావరణాన్ని అద్భుతంగా చూపిస్తూ పాటను వెంటనే ఆకట్టుకునేలా చేస్తుంది.

ఈ పాటలో వరుణ్ తేజ్ సంప్రదాయ దుస్తులతో పాటు స్టైలిష్ షేడ్స్‌లో మాస్ లుక్‌తో మెరిశారు. ఆయన హై ఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్ పాటలోని సెలబ్రేషన్ మూడ్‌ను మరింత ఎలివేట్ చేశాయి. కార్నివాల్ థీమ్‌లో రూపొందించిన కలర్‌ఫుల్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌కు గ్రాండియర్ తీసుకొచ్చాయి. దక్ష నగార్కర్ తన గ్లామర్, ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, వరుణ్ తేజ్‌తో ఆమె కెమిస్ట్రీ స్క్రీన్‌పై



ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగ వాతావరణం, ఫోక్ బీట్స్, వీరిద్దరి కెమిస్ట్రీ కలిసి 'రాసా గుమ్మడి' ని బిగ్ స్క్రీన్‌పై ప్రేక్షకులను అలరించే ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టనున్నాయి. ఈ చిత్రంలో రితిక నాయక్ కథా నాయికగా నటిస్తుండగా, సత్య ఎంటర్టైనింగ్ రోల్ లో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమాకి రచన, దర్శకత్వం: మేర్లపాక గాంధీ, నిర్మాతలు: రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి, సంగీతం: తమన్, సినిమాటోగ్రాఫర్: మనోజ్ రెడ్డి, ఎడిటర్: సత్య జి, ఆర్ట్ డైరెక్టర్: ఎ పన్నీర్ సెల్వం.

## ఫిల్మ్ ఇండస్ట్రీలో నిజాలు బయటపెట్టిన ప్రియాంక చోప్రా!



బాలీవుడ్ నుంచి హాలీవుడ్ దాకా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గ్లోబల్ నటి ప్రియాంక చోప్రా, ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉండే లోపాలు, గ్రూపు రాజకీయం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. కష్టపడి స్టార్‌డమ్ సాధించినప్పటికీ, ఇండస్ట్రీలోని కొన్ని వర్గాల ఇంప్రెస్ పొందకపోవడం వల్ల తను ఎలా నష్టపోయిందో ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా మాట్లాడారు.

హిందీ చిత్రసీమలో ఎదురైన చేదు అనుభవాలు, తన అవకాశాలను లాగేసుకున్న తీరు గురించి ఆమె బయటపెట్టిన నిజాలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సినీ పరిశ్రమలో కొన్ని నిర్దిష్ట వర్గాలు లేదా పవర్‌ఫుల్ వ్యక్తుల డిమాండ్లకు అనుగుణంగా నడుచుకోకపోవడం వల్లే తాను అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని ప్రియాంక వెల్లడించారు. తన కష్టంతో సాధించుకున్న పలు పెద్ద సినిమాల నుంచి తనను అర్ధాంతరంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఇండస్ట్రీలోని కొంతమంది కీలక వ్యక్తులను మెప్పించలేదనే ఒంటరి కారణంతో, తన చేతిలో ఉన్న ఆఫర్లను లాగేసుకున్నారని ఆమె సంచలన కామెంట్స్ చేశారు. హాలీవుడ్ బాట: బాలీవుడ్‌లో ఒకానొక దశలో తనను పూర్తిగా మూలన పడేసేందుకు తీవ్రంగా కుట్రలు జరిగాయని ప్రియాంక చెప్పారు. సరిగ్గా అదే సమయంలో సంగీత రంగం ద్వారా అమెరికా వెళ్లే అవకాశం రావడం తన కెరీర్‌కు ఊరటనిచ్చిందని తెలిపారు. ఆ పరిణామాలే తదనంతరం 'క్వాంటికో' సిరీస్ సాధించడానికి, అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ స్టార్‌గా ఎదిగేందుకు మార్గం సుగమం చేశాయని వివరించారు. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, నటీనటులకు క్యాంపులు లేదా వర్గ రాజకీయాల ఆధారంగా కాకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే అవకాశాలు దక్కాలని ప్రియాంక అభిప్రాయపడ్డారు. వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ ఎప్పుడూ ఆరోగ్యకరంగా ఉండాలని, నటులను ఒక కోణంలోకి నెట్టేసే సంస్కృతి మారాలని సూచించారు. బయటి నుంచి వచ్చి నిలదొక్కుకోవాలని చూసే ప్రతిభావంతులకు ఇండస్ట్రీలో సరైన వేదిక దొరకాలంటే ఇలాంటి అంతర్గత రాజకీయాలు తొలిగిపోవాలని పిలుపునిచ్చారు. ఇండస్ట్రీలోని కొన్ని వర్గాలను సంతృప్తి పరచకపోతే తొక్కేస్తారనే చేదు నిజాన్ని ప్రియాంక చోప్రా ధైర్యంగా బయటపెట్టారు. బాలీవుడ్‌లో మూలన పడేయాలని చూసినా, హాలీవుడ్‌లో అడుగుపెట్టి గ్లోబల్ ఐకాన్‌గా మారిన ఆమె ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఇక ప్రియాంక చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం ఒక నటి ఆవేదన మాత్రమే కాదు, సినిమా రంగంలో ఇప్పటికీ రాజ్యమేలుతున్న గ్రూపు రాజకీయాలపై వేసిన ఒక పవర్ ఫుల్ ప్రశ్న.



# విజయం వేటలో..

### - సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్‌పై ఫోకస్-జింబాబ్వేతో భారత్ తొలి టీ20 నేడు
### - సాయంత్రం 4.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

**హరారే:** టీమ్ ఇండియా.. జింబాబ్వే పర్యటన అనగానే ఆర్థికంగా ఆ క్రికెట్ బోర్డుకు బీసీసీఐ అందిస్తున్న మద్దతుగానే ఎక్కువగా చూసేవాళ్లం. కానీ, తాజా పర్యటనలో చర్చ ఆర్థిక సహకారం నుంచి క్రికెట్ వైపు మళ్లింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ఓటములు చవిచూసిన టీమ్ ఇండియా.. విజయమే లక్ష్యంగా జింబాబ్వేలో అడుగుపెట్టింది. ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం అందుకోని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సైతం తొలి గెలుపు కోసం ఎదురుచూస్తున్నాడు. మరోవైపు వరుస ఓటములతో దెబ్బతిన్న భారత్‌పై ఈసారి సిరీస్ విజయం సాధించాలనే తపన ఆతిథ్య జింబాబ్వే శిబిరంలో కనిపిస్తోంది. ఇరు దేశాలు విజయం వేటలో అస్త్రాలు సిద్ధం చేస్తుండగా భారత్, జింబాబ్వే తొలి టీ20 నేడు. భారత కాలమానం ప్రకారం మ్యాచ్ సాయంత్రం 4.30 గంటలకు ఆరంభం కానుంది.



**కూర్పు కుదిరేనా?**

ఇటీవల ఎక్కువగా ఆసియాలోనే టీ20లు ఆడిన భారత్.. బ్రిటన్ పర్యటనలో పరిస్థితులకు త్వరగా అలవాటు పడలేకపోయింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లు భారత్ బలహీనతను గొప్పగా సొమ్ము చేసుకున్నాయి. హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ సైతం పేస్‌కు అనుకూలం. కానీ, ఇక్కడ ఆడిన అనుభవం భారత యువ క్రికెటర్లకు ఉంది. అభిషేక్ శర్మ కెరీర్ తొలి టీ20 సెంచరీ ఇక్కడే బాదగా, వైభవ్ సూర్యవంశీ అండర్19 ప్రపంచకప్ ఫైనల్లో శతకమోత మోగించింది హరారేలోనే. జట్టుగా మంచిగానే కనిపిస్తున్నా... మైదానంలో ప్రదర్శన తీసికట్టుగా తయారైంది. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ బ్యాటింగ్ బాధ్యత తీసుకోవాలి. టాప్ ఆర్డర్‌లో అభిషేక్, సూర్యవంశీ ఇద్దరూ హిట్టర్లే. ఈ ఇద్దరిలో ఎవరు నిలిచినా ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలే. ఇదే సమయంలో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు బాధ్యతగా రాణిస్తే భారత్ నిలకడగా భారీ స్కోర్లు చేయగలదు. యువ బౌలర్లు మయాంక్ యాదవ్, అశోక్ శర్మ, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్‌లో ముగ్గురు తుది జట్టులో నిలిచే సూచనలు ఉన్నాయి. హర్ష్ దూబె స్పిన్ ఆల్‌రౌండర్‌గా, శివమ్ దూబె పేస్ ఆల్‌రౌండర్‌గా తుది జట్టులో ఆడనున్నారు. బ్యాటింగ్ లైనప్ పరంగా సంజు శాంసన్ మినహా మిగతా అందరూ బ్రిటన్ పర్యటనలో ఆడినవాళ్లే. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ విజయం కోసం ఎదురుచూస్తున్నాడు. నేడు హరారేలో ఏం జరుగుతుందో చూడాలి.

**ఉత్సాహంగా జింబాబ్వే**

జింబాబ్వే నెమ్మదిగా పసికూన ట్యాగ్‌కు దూరం జరుగుతూ వస్తోంది. టీ20 ప్రపంచకప్‌లో సూపర్8కు చేరుకున్న జింబాబ్వే.. ఇటీవల బంగ్లాదేశ్‌పై ఏకైక టెస్టు లో విజయంతో పాటు వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. టీ20ల్లో ఓడినా.. టెస్టు, వన్డే సిరీస్ విజయాలు ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. సికందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే పూర్వ వైభవం సాధించే దిశగా దూసుకెళ్తోంది. టీ20ల్లో భారత్‌పై జింబాబ్వే మూడు విజయాలు సాధించగా.. ఆ మూడు మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లోనే జరిగాయి. బ్రియాన్ బెనెట్, మారుమణి, మేయర్స్, బ్రాడ్ ఎవాన్స్ బ్యాట్‌తో జింబాబ్వేకు కీలకం కానుండగా.. నుమాన్, రిచర్డ్స్, బ్లెస్సింగ్ ముజరబాణిలు జింబాబ్వేకు కీలకం. హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ పేస్‌కు అనుకూలం. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పేస్‌కు మరింత మేలు చేస్తున్నాయి. ఇక్కడ టీ20ల్లో మంచి స్కోర్లు నమోదయ్యాయి. భారత్, జింబాబ్వే సిరీస్‌లో మూడు మ్యాచ్‌లో ఇక్కడే జరుగుతాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సిరీస్‌లో సగటున 180-200 పరుగులు సాధించే అవకాశాలు ఉన్నాయి. తొలి టీ20కు వర్షం సూచనలు లేవు.



## నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు

### 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్స్

**గ్లాస్గో (స్కాట్లాండ్) :** స్కాట్లాండ్‌లోని పోర్ట్‌నగరం కామన్‌వెల్త్ క్రీడలకు స్పోర్ట్స్ క్యాపిటల్‌గా మారింది!. 2014లో కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన గ్లాస్గో నగరం.. 2026 క్రీడల ఆతిథ్యం నుంచి ఆస్ట్రేలియా తప్పుకోవటం మరోసారి నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. ఆర్థిక సవాళ్లు, నిర్వహణ వ్యయ భారం కామన్‌వెల్త్ క్రీడలను కళ తప్పేలా చేశాయి. 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్లతో నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు ఆరంభం కానున్నాయి. బ్రిటీష్ పాలిత దేశాలు పోటీపడే ఈ క్రీడల్లో ఈసారి 74 దేశాల నుంచి సుమారు 3 వేల మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. నేటి ఆరంభ వేడుకలతో పోటీలు ప్రారంభం కానుండగా.. ఆగస్టు 2న ముగింపు వేడుకలతో క్రీడలు ముగియనున్నాయి. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాలు ఉండగా.. తాజాగా గ్లాస్గోలో వాటిని 10కు కుదించారు. బాస్కెట్‌బాల్, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, బౌల్స్, బాక్సింగ్, జూడో, నెట్‌బాల్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో 74 దేశాల క్రీడాకారులు పోటీపడనున్నారు. పారా విభాగంలో ఆరు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. తొలి రోజు పోటీల్లో బౌల్స్, పారా బౌల్స్ ఈవెంట్లు జరగనున్నాయి. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ 125 మందితో కూడిన బలమైన జట్టును పంపిస్తోంది. ఒలింపిక్ పతక విజేతలు నీరజ్ చోప్రా, మీరాబాయి చాను వంటి మేటి అథ్లెట్లు గ్లాస్గోలో బరిలోకి దిగుతున్నారు.



- ప్రధాని మోదీ, అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి!
- సూళ్లూరుపేటలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ,
- ఆర్టీసీ బస్టాండ్ వద్ద హోరెత్తిన కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- రాహుల్, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను ఖండించిన డీసీసీ అధ్యక్షుడు బాలగురువం బాబు.

# ఎన్డీఏ అసమర్థ పాలనకు స్వస్తి పలకాలి





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశంలో పేపర్ లీకేజీలు, అవినీతి కుంభకోణాలు తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షుడు బాలగురువం బాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీఏ అసమర్థ పాలనకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**"రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు - హోరెత్తిన సూళ్లూరుపేట"**

బుధవారం సూళ్లూరుపేటలోని ఆర్ అండ్‌బీ కార్యాలయము నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ ప్రధాన బజారు వీధులు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు సాగింది.బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు":-ఈ సందర్భంగా బాలగురువం బాబు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీల వల్ల మానసిక వేదనకు గురై దేశవ్యాప్తంగా 20 మందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణమన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులకు మద్దతుగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశ్నించే గొంతులను అధికార బలంతో నొక్కేయాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, 2029 ఎన్నికల్లో ఎన్డీఏకు పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దేవదానం, తిరుపతి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రమేష్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మావుడూరు వెంకటాచలపతి, టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి, మహిళా నాయకులు శ్వేత,చాముండేశ్వరితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





- టెండర్ల దాఖలుకు ఆఖరు తేదీ ఆగష్టు 14
- డిజిటల్ వైద్య సేవల రంగంలో అనుభవం ఉన్న వారు అర్హులు
- 5 కోట్లకు పైగా ఉన్న రాష్ట్ర ప్రజల ఆరోగ్య రికార్డుల నిక్షిప్తం
- ఏకీకృత విధానంలో వైద్య సేవలు
- భారీగా మెరుగుపడతాయన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# రాష్ట్ర వ్యాప్తంగా "సంజీవని"అమలుకు టెండర్ల ఆహ్వానం



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** అమరావతి :-రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించడంలో నూతన అధ్యాయం సృష్టించనున్న"సంజీవని"పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. సంజీవని (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ కేర్ కోఆర్డినేషన్ అండ్ హెల్త్ కేర్ డెలివరీ సిస్టం)అమలుకు అవసరమైన విస్తృతమైన, పటిష్టమైన సమీకృత సాంకేతిక వేదిక(ప్లాట్ ఫాం)ను రూపొందించి, 5 సంవత్సరాల పాటు సేవలం దించేందుకు సంబంధించిన పలు నిబంధనలతో కూడిన ఆర్ ఎఫ్ పి(రిక్వస్ట్ ఫర్ పార్టిసిపేషన్)ని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈ ఆర్ఎఫ్‌పికి సంబందించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించి మంగళవారం వైద్యారోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆమోదించారు.ఈ పథకానికి సంబంధించిన వివిధ అంశాలను నిర్ణీత కాలపరిమితిలో అమలుపరిచేలా నిరంతర పర్యవేక్షణతో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు.

**కాల పరిమితులు: ప్రీబిడ్ మీటింగ్-జులై 27**

ప్రీబిడ్ మీటింగ్ లో ఉత్పన్నమయ్యే అంశాలపై వివరణ - జులై 31 టెండర్ల దాఖలుకు ఆఖరు తేదీ- ఆగస్టు 14
టెక్నికల్ బిడ్ మదింపు -ఆగస్టు 19
ఫైనాన్షియల్ బిడ్ మదింపు -ఆగస్టు 31
టెండర్లపై తుది నిర్ణయం- సెప్టెంబర్ 7.వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వైద్య సేవల రంగంలో అనుభవం ఉన్న భారతీయ సంస్థలు టెండర్లు వేయడానికి అర్హులని,వివిధ జాతీయ,రాష్ట్ర ఆరోగ్య పథకాల కింద సేవలందించిన అనుభవం ఉండాలని, ఈ విషయాలకు సంబంధించి గత మూడేళ్ల అనుభవాన్ని పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది.సంజీవని పథకం ప్రధానంగా డిజిటల్ సాంకేతికత ఆధారంగా అమలుకానున్నందున క్యూసీబియస్ విధానంలో టెండర్లపై తుది నిర్ణయాన్ని తీసుకుంటామని, సాంకేతిక సామర్థ్యానికి 70 శాతం,ఆర్థిక స్థోమతకు 30 శాతం మార్కు లుంటాయని ఆర్ ఎఫ్‌పిలో ప్రభుత్వం తెలియపరిచింది.

**సంజీవనితో నూతన అధ్యాయం:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భారీ వ్యయంతో పలు ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నా, అంతిమంగా ఆశించిన ఫలితాలు పొందడంలో స్పష్టమైన లోటు కనపడుతోందని మంత్రి సత్య కుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వెలిబుచ్చారు. దాదాపు 40 పథకాలు విడివిడిగా అమలవుతుండటం, వాటి మధ్య సమన్వయ లోపం, సమీకృత దృష్టితో కాకుండా విడివిడిగా ఆయా పథకాల ఫలితాలను అంచనా వేయడం, రియల్ టైంలో ప్రజల ఆరోగ్య స్థితిని మదింపు చేసి తగు విధంగా క్లినికల్ పరంగా జోక్యానికి వీలు లేకపోవడం వంటి పలు కారణాలతో ప్రస్తుత విధానంలో ఆశించిన మేరకు సత్ఫలితాలు రావడం లేదని మంత్రి వివరించారు.ఈ ప్రతికూల పరిస్థితిని అధిగమించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆరోగ్య శాఖ సంజీవని పథకాన్ని రూపొందించి కుప్పంలో గత జులైలో పైలట్ గా అమలుపరిచి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 28 జిల్లాల్లో అమలుపరిచేందుకు బుధవారం టెండర్లను ఆహ్వానించామని మంత్రి తెలిపారు.ఈ పథకం కింద రాష్ట్రంలోని మొత్తం 5 కోట్లకు పైగా ఉన్న ప్రజల ఆరోగ్య స్థితిగతులను నిక్షిప్తం చేసి, వివిధ అంశాల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు నమోదే చేసి,ప్రజల ఆరోగ్య చరిత్ర ఆధారంగా వారి ఆరోగ్యానికి సంబంధించి ఎదురయ్యే సమస్యలపై ముందుగానే ప్రజలకు హెచ్చరించి,తగు చికిత్సల కోసం డాక్టర్లతో సంప్రదింపుల సమయాలను కూడా ఏర్పాటు చేసి,అవసరాల మేరకు టెలీకన్సల్టేషన్లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వైద్య సేవలందించే సదుపాయాన్ని కల్పించి,వైద్యుల సూచనల మేరకు రోగులు చికిత్స పొందారా లేదా అన్న విషయాన్ని కూడా సంజీవని పథకంలో పర్యవేక్షిస్తారని మంత్రి సత్య కుమార్ వివరించారు.సంజీవని పరిధి":-ప్రజల ఆరోగ్యానికి సంబంధించి 12 ప్రధాన అంశాలను సంజీవని పథకంలో ప్రభుత్వం పొందుపరిచింది. ఇవి- తల్లి మరియు నవజాత. పిల్లల ఆరోగ్యం, రిప్రొడక్టివ్ హెల్త్, సంక్రమిక, అసంక్రమిక వ్యాధులు,మానసిక ఆరోగ్యం, దంత ఆరోగ్యం, కన్ను, ఇన్ఎన్‌టి సంరక్షణ,ట్రామా కేర్, ఉపశమన వైద్యం,పెద్దల ఆరోగ్యం,వైద్య నిర్ధారణ పరీక్షలు ఉచిత మందుల సరఫరా ఆయా ఆరోగ్య పథకాల కింద ఉత్పన్నమయ్యే వ్యక్తుల సమాచారాన్ని సమీకరించి దాని ఆధారంగా ప్రజలకు తగు సూచనలు, సలహాలను అందించి తద్వారా రియల్ టైంలో అవసరాల మేరకు వైద్య పరంగా జోక్యం చేసుకునేందుకు అవసరమైన డిజిటల్ హెల్త్ ప్లాట్ ఫాంను రూపొందించి,5 ఏళ్ల పాటు టెండర్ విజేత నిర్వహించాల్సి ఉంటుందని ఆర్ ఎఫ్‌పిలో ప్రభుత్వం స్పష్టం చేసింది.వ్యాధులు సోకినప్పుడు చికిత్సనందించే సాంప్రదాయ విధానానికి భిన్నంగా, వ్యాధుల రాకను ముందుగానే పసిగట్టి వాటి నివారణకు చర్యలు తీసుకుని, తద్వారా వ్యక్తులు, సమాజంపై అనారోగ్య భారాన్ని భారీ స్థాయిలో తగ్గించేందుకు సంజీవని పథకం నూతన బాటలు వేస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయమే విద్యార్థి విజయానికి బాట

- మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్ (పీటీఎం--4.0) విజయవంతం చేయాలి
- మండల విద్యాశాఖ అధికారి కస్తూరయ్య పిలుపు



**పెళ్లకూరు-సూర్య వాస్తవం:** విద్యార్థుల విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్ (పీటీఎం-4.0) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) కస్తూరయ్య విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మెగా పీటీఎం--4.0 కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రి తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత విద్యా పురోగతి, చదువులో ఎదురవుతున్న సమస్యలు, పాఠశాల--తల్లిదండ్రుల సమన్వయం, విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పరం చర్చించుకునే అవకాశం కలుగుతుందని వివరించారు.

"ఉపాధ్యాయులు విద్యను అందిస్తారు... తల్లిదండ్రులు ప్రోత్సాహాన్ని అందిస్తారు. ఈ రెండు కలిసి నడిచినప్పుడే విద్యార్థి జీవితంలో సానుకూల మార్పు సాధ్యమవుతుంది" అని కస్తూరయ్య పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, ఈ సమావేశాన్ని ఒక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి కస్తూరయ్య విజ్ఞప్తి చేశారు.

# డా.వి పి కుమార్ రెడ్డికి నివాళులర్పించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** నాయుడుపేటలో ప్రముఖ రాజకీయ నాయకులు డాక్టర్ వి పి కుమార్ రెడ్డికి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు స్థానిక వైసిపి నాయకులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. విపి కుమార్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం నాయుడుపేట పట్టణంలోని కుమార్ రెడ్డి నివాసంలో ఆయన ఉత్తర క్రియలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసిపి నాయకులు నల్లపురెడ్డి జగదీశ్ రెడ్డిలు డాక్టర్ విపి కుమార్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసా దించాలని ఆకాంక్షించారు. అలాగే వారి వెంట ఉన్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి,వైసిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నాయుడుపేట ఏ.ఎం.సీ మాజీ ఛైర్మెన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి,పార్టీ వైసీపీ సీనియర్ నాయకులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి,వైసీపీ నాయుడుపేట మండల పార్టీ అధ్యక్షులు ఓట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి,దొరవారిసత్రం మండల పార్టీ అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి,సూళ్లూరుపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కట్టా భవాని శంకర్ రెడ్డి,మాజీ నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి,వైసిపి మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, నాయుడుపేట పట్టణ ప్రధాన కార్యదర్శి పేర్నాటి రాహుల్,వైసీపీ నాయకులు బైనా మల్లికార్జున్ రెడ్డి,పేట చంద్ర రెడ్డి, వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు భావన్ అనుదీప్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పాలేటి నాగార్జున,నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షబ్బీర్,మహిళా విభాగం నాయకురాలు కన్మణి గారు, వైఎస్ఆర్సీపీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు డాక్టర్ వి పి కుమార్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నీట్ ప్రశ్నాపత్ర లీకేజీలను ఖండిస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిరసన



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో బుధ వారం సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు తిరుపతి జిల్లా కార్యదర్శి హెచ్.లోకేష్ పాలొగొన్నారు ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు నీట్ ప్రశ్నాపత్రాలు అనేకసార్లు లీక్ కావడం ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ఈ లీకేజీల కారణంగా అనేక మంది విద్యార్థులు మానసికంగా దెబ్బతిని ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ ఘటనలకు ప్రధాన బాధ్యత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ)అన్ని ఆరోపిస్తూ, వీరిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని,వారి పదవులను తొలగించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువకులు న్యాయం కోసం ఆందోళనలు నిర్వహిస్తుంటే వారిపై లాఠీచార్జ్ చేయడం ఖండనీయమని, ఇదే సమయంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో నిమగ్నమవడం బాధాకరమని అన్నారు.నీట్ లీకేజీల వల్ల నష్టపోయిన విద్యార్థులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలని, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు,యువకులు,ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నియోజకవర్గ కార్యదర్శి కె.వి.ప్రసాద్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నమంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** విజయవాడ :-రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వ హించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబం ధించిన వివిధ అంశాలపై మంత్రుల బృందం, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమగ్రంగా చర్చిం చారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్రభుత్వ పరిపాలనను మరింత సమర్థ వంతంగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకుని సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )